## క్లుప్తంగా

### ఎమ్మెల్యే పరామర్శ



శేషగిరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని కాగాం గ్రామ సర్పంచ్ మాదాసు లక్ష్మి భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు మాదాసు శేషగిరి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విశాఖపట్నంలోని కేర్ ఆస్పత్రికి శనివారం వెళ్లి, ఆయనను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలతో పాటు, ఆయనకు అందిస్తున్న వైద్యసేవలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని సర్పంచ్ లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. శేషగిరి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

### ముమ్మరంగా వాహన తనిఖీలు



కారులో తనిఖీలు చేపడుతున్న ఎస్ఈబీ సిబ్బంది

బొబ్బిలి: పాతబొబ్బిలి జంక్షన్ వద్ద ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఇదే కూడలి మీదుగా ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వాహనాల రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మాదకద్రవ్యాలు, సారా, మద్యం వంటివి అక్రమంగా రవాణా కాకుండా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఏదైనా అక్రమ రవాణా జరిగినట్లు అయితే ఫోన్ నంబరు 9440902372కు సమాచారం ఇవ్వాలని, వివరాలు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

### నవదుర్గ ఆలయ ఆదాయం రూ.2.93 లక్షలు



హుండీల్లోని కానుకల ద్వారా వచ్చిన ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, భక్తులు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయ హుండీల్లో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని శనివారం లెక్కించామని ఈవో పి.శ్యామలరావు తెలిపారు. సూపర్‌వైజర్ బీవీ మాధవరావు సమక్షంలో హుండీలు తెరిచి, లెక్కించగా, 37 రోజులకు గాను రూ.2,93,377 సమకూరిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, పర్యవేక్షకులు కూరాడ వెంకటరావు, అర్చకులు రామాయణం శ్రీనివాసరావుశర్మ, రంపా రామచంద్రరావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

### చెరకు కాటా ప్రారంభం



చెరకు కాటా ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రామారావు

బాడంగి: మండలం నుంచి సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి చెరకు పంటను సక్రమంగా తరలించాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీను, సర్పంచ్ కండి రమేష్ కోరారు. స్థానిక సంతతోట వద్ద సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం కొత్తగా ఏర్పాటు చేసిన చెరకు కాటాను వారు శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతుల వద్ద ఉన్న చెరకు పంటను ఫ్యాక్టరీకి తరలించేలా చూడాలన్నారు. పంటను తూకం వేసిన వెంటనే ఎండిపోకుండా సకాలంలో తరలించాలన్నారు. ఈ ఏడాది చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3,080గా ఫ్యాక్టరీ నిర్ణయించిందని ఇన్‌చార్జ్ సెంటర్ ఆఫీసర్ డి.సింహాచలం తెలిపారు.

### హోమ్ నర్సింగ్‌లో ఉచిత శిక్షణ

రాజాం: స్థానిక పట్టణంలోని జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ హోమ్ నర్సింగ్‌లో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని జీఎంఆర్‌వీఎఫ్ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరం, గొట్లాం రోడ్డు, జీఎస్‌టీయూ జంక్షన్‌ల వద్ద శిక్షణ సంస్థల్లో రెండు నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. పదో తరగతి చదివి, 19 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న మహిళలు అర్హులని, శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఫోన్ నంబరు 8186884244ను సంప్రదించాలని కోరారు.

# కచ్చితమైన ఓటరు జాబితాయే లక్ష్యం

కచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈఆర్‌వో(ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్)లు, బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్)లు కలిసి, ప్రభుత్వం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఓటరు విజ్ఞప్తుల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్ల వయసు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. కొత్తగా ఓటుహక్కు కోసం పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

–బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: రాజాం పట్టణంలో ప్రభుత్వ బాలికల పాఠశాల వద్ద బీఎల్‌వోలకు సూచనలిస్తున్న ఈఆర్‌వో సుధారాణి



రాజాం: పెనుబాకలో పోలింగ్ కేంద్రం వద్ద నిర్వహించిన ఓటరు స్పెషల్ డ్రైవ్‌లో సర్పంచ్ బోడమ్మ తదితరులు



తెర్లాంలో ఓటర్ల నమోదుకు సంబంధించి, వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దారు రత్నకుమార్



రామభద్రపురం: ఆరికతోటలో ఓటుహక్కు నమోదుపై ఆరాతీస్తున్న ఆర్డీవో సాయిశ్రీ



బొబ్బిలి: పిరిడిలో ఓటర్ల జాబితా పరిశీలనలో బీఎల్‌వోలు, ఓటర్లు



బాడంగిలో గురుకుల పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటరు దరఖాస్తు సమర్పిస్తున్న యువతి

## ఇంకుడుగుంత నిర్మాణానికి రూ.6 వేలు



హౌసింగ్ డే కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డీఈఈ అప్పయ్య

తెర్లాం: స్థానిక జగనన్న కాలనీ లేఅవుట్‌లో ప్రతీ ఇంటి నిర్మాణం వద్ద ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని గృహ నిర్మాణ శాఖ బొబ్బిలి డీఈఈ పలగర అప్పయ్య సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా స్థానిక జగనన్న కాలనీ లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించిన ఆయన ఒక్కో ఇంకుడుగుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 వేలు మంజూరు చేస్తోందని తెలిపారు. భూగర్భ జలాలు పెరిగేందుకు, వాడుక నీరు పక్క ఇంటి వైపు వెళ్లకుండా ఉండేందుకు ఈ ఇంకుడు గుంతలు దోహదపడతాయన్నారు. ప్రతీ లబ్ధిదారుడు తప్పనిసరిగా ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, లేకపోతే ఏ స్థాయిలో నిర్మాణం ఉన్నా వాటిని ప్రభుత్వం రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఆనందకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, వలంటీర్లు ఉన్నారు.

## విత్తనశుద్ధిపై అవగాహన

రాజాం: మండలంలోని బొమ్మినాయుడువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా చేపట్టే విత్తనశుద్ధిపై శనివారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారిణి ఎ.రేణుకాసాయి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసే పెసర, మినప తదితర పంటలకు సంబంధించి, విత్తనాలు జల్లే ముందు ఆవుపేడ, ఆవుమూత్రంతో తయారు చేసే బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేసుకుని, చల్లుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎల్‌వన్ రమాదేవి, ఐసీఆర్‌పీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# వంటపాత్రల పంపిణీ



వంటపాత్రలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: మండల రిసోర్సు కార్యాలయంలో జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలకు సంబంధించి, ప్రభుత్వం అందజేసిన వంటపాత్రలను ఎమ్మెల్యే కంబాల జోగులు చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులకు రుచి, శుచితో కూడిన భోజనం అందించాలని, మెనూ ప్రకారం ప్రతిరోజూ వంటకాలు చేసి, విద్యార్థులకు పెట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, వైస్ ఎంపీపీలు వావిలపల్లి జగన్మోహనరావు, టంకాల అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మద్యంసీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

రాజాం సిటీ: మండలంలోని మారెడుబాక గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం విక్రయాలపై ఎస్ఈబీ సిబ్బంది శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన బుడ్డెపు లోకేశ్వరరావు దగ్గర నుంచి ఏడు మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ బి.శ్రీధర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎస్.పిచ్చేశ్వరరావు, ఎం.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 11వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే విశ్వరూప మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నేతలు కింతలి రాము, కాగా సునీల్ కుమార్, కింతలి చిన్న, కింతలి చంటి శనివారం ఆవిష్కరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ సభకు ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మాదిగలంతా తరలిరావాలని కోరారు.

## వైఎస్సార్ సీపీ నేత మృతి



మురళీధరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు తదితరులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఐటీఐ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నేత అరసాడ మురళీధరరావు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి, కౌన్సిలర్లు పాలవలస ఉమాశంకర్, సవలాపురం రామకృష్ణ, లక్ష్మి తదితరులు మురళీధరరావు ఇంటికి చేరుకుని, ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

## రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



బొడ్డవలస గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బొడ్డవలస గ్రామంలో రూ.6 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. 15వ ఆర్థికసంఘం నిధులతో 130 మీటర్ల మేర ఈ నిర్మాణం చేపడుతున్నామని సర్పంచ్ పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు.

## సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

మెంటాడ: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. శనివారం మండలంలోని కొంపంగి గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం గ్రామసచివాలయాలతో సాధ్యమవుతోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వ సేవలు కావాలంటే మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు గ్రామాల్లోని సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు ఇక్కడి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయన్నారు. ఇలాంటి గొప్ప వ్యవస్థల ద్వారా పాలన సులభతరమైందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, సర్పంచ్ కూనిబిల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఆరోగ్య భాగ్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రారంభోత్సవంలో వైఎస్సార్ సీపీ నాయకులు

మెంటాడ: ప్రభుత్వం గ్రామగ్రామాన నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఆరోగ్య భాగ్యం కలుగుతోందని వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని కొంపంగి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా చేపట్టే వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులతో మెరుగైన వైద్యం అందజేయడం జరుగుతోందన్నారు. 7 నుంచి 14 రకాల వైద్యపరీక్షలు చేయడంతో పాటు 150 నుంచి 170 రకాల మందులను ఉచితంగా అందజేయడం జరుగుతోందన్నారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ఉన్నత ఆస్పత్రులకు రిఫర్ చేయడం కూడా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

# గ్రామసభల్లో ఉపాధి పనుల గుర్తింపు

రేగిడి: గ్రామసభల ద్వారా అవసరమైచోట ఉపాధి హామీ పనులు చేసేందుకు గ్రామస్తులు, రైతుల అభిప్రాయం మేరకు గుర్తిస్తున్నామని ఏపీవో ఎస్.హరనాథరావు అన్నారు మండలంలోని వన్నలి గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గ్రామసభలకు హాజరై, అవసరమైన పనులను అధికారులకు తెలియజేయాలన్నారు. గ్రామసభ ఆమోదం ద్వారా ఉన్నతాధికారులకు దీనిపై నివేదిక పంపిస్తామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, రూ.75 లక్షల విలువైన పనులను ఇంతవరకు గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గార రమణ తదితరులు పాల్గొన్నారు.

# చురుగ్గా ఆలయ నిర్మాణ పనులు

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో శ్రీకోదండరామ ఆలయ నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి.

రూ.40 లక్షల అంచనా వ్యయంతో ఆలయం నిర్మాణం చేస్తున్నారు. శనివారం ఆలయ సింహ ద్వారం ఏర్పాటు పనులు చేపట్టి, పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ద్వారబంధాల ఏర్పాటుకు గ్రామస్తులు పూజలు చేశారు. గ్రామస్తులంతా కలిసి ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు సర్పంచ్ గార రమణ తెలిపారు.

## ట్రై సైకిళ్ల పంపిణీ రేపు



పంపిణీకి సిద్ధం చేసిన ట్రై సైకిళ్లను పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, ఎంపీడీవో రవికుమార్

సంతకవిటి: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పలువురు దివ్యాంగులకు మంజూరైన ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను ఎమ్మెల్యే కంబాల జోగులు చేతులమీదుగా సోమవారం పంపిణీ చేయనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, ఎంపీడీవో జీవీ రవికుమార్ తెలిపారు. శనివారం ట్రై సైకిళ్లను పరిశీలించిన వారు పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల వివరాలను వలంటీర్ల ద్వారా తెలియజేస్తారన్నారు.

## గృహ నిర్మాణాలపై సమీక్ష

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌పీ(రిసోర్స్‌పర్సన్)లు, మెప్మా సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు శనివారం సమావేశమై, జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై శనివారం సమీక్షించారు. ఈ నెల 20వ తేదీ నాటికి ప్రతీఒక్క ఆర్‌పీ తమ పరిధిలో ఎనిమిది ఇళ్ల శ్లాబులు వేయించాలని, డిసెంబరు నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతీ శనివారం గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

రాజాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు గ్రామ పంచాయతీల డీడీవోలు, సచివాలయాల సిబ్బందితో మండల పరిషత్ ప్రత్యేకాధికారి సుధాకర్ శనివారం సమావేశమై, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న కాలనీ గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఈవోపీఆర్‌డీవో వావిలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రామమందిరం పునర్నిర్మాణానికి నిధుల మంజూరు



పునర్నిర్మించనున్న బొద్దాం రామమందిరం

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో వందేళ్ల నాటి పురాతన రామమందిరం పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖ నిధులు సమకూర్చింది. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో రెండు నెలల క్రితం గ్రామంలో ఓ కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి ఆలయ పరిస్థితిని వివరించినట్లు సర్పంచ్ నక్క తవిటమ్మ, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి తెలిపారు. రూ.1 కోటి నిధులు కావాలని వినతిపత్రం కూడా అందించామన్నారు. స్పందించిన ఆయన, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా నిధుల మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం రూ.10 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. మిగతా రూ.90 లక్షలు టీటీడీ ద్వారా మంజూరయ్యేలా జెడ్పీ చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కృషిచేస్తున్నారన్నారు. త్వరలో ఈ నిధులు కూడా వచ్చే అవకాశముందని, మొత్తం నిధులు సమకూరిన తర్వాత ఆలయ పనులు ప్రారంభిస్తామన్నారు.

# గర్భిణులు, బాలింతలకు ‘టేక్ హోమ్ రేషన్’



టీహెచ్ఆర్ కిట్లుతో గర్భిణులు, బాలింతలు

తెర్లాం: స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టీహెచ్ఆర్(టేక్ హోమ్ రేషన్/పౌష్టికాహారం) కిట్లను శనివారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మనం తీసుకునే రోజువారీ ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, అలాంటప్పుడే మనం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామన్నారు. ముఖ్యంగా రక్తహీనత బారినపడకుండా చూసుకోవాలన్నారు. ప్రతినెలా ఆరోగ్య తనిఖీలు చేసుకుని, అవసరమైన మందులు సక్రమంగా వాడాలన్నారు.

## విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: రాజాంలోని ఓ ప్రైవేటు ఐటీ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఐటీ మూడో ఏడాది చదువుతున్న సంచాన లక్ష్మీ ఆదిత్య(21) ఈ నెల 1వ తేదీ మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని తండ్రి వెంకటరమణమూర్తి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లోకేశ్వరరావు శనివారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి ప్రాంతానికి చెందిన వెంకటరమణ వైజాగ్‌లో ఎంవీపీ కాలనీలో ఉంటూ రైతుబజారులో కూరగాయల వ్యాపారం చేస్తూ లక్ష్మీ ఆదిత్యను రాజాంలోని కళాశాల హాస్టల్‌లో ఉంచుతూ చదివిస్తున్నారు.

## స్కూటీ అపహరణపై..

రాజాం సిటీ: మండల పరిధిలోని బొద్దాం గ్రామానికి చెందిన అల్లు అనిత తన స్కూటీ అపహరణకు గురైందని శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వై.రవికిరణ్ తెలిపారు. రాజాంలోని కంప్యూటర్ కోచింగ్ ముగించుకుని, ఇంటికి వెళ్తున్న సమయంలో కీర్తన ఓ బేకరి షాపు వద్ద స్కూటీ ఆపి, తాళం తీయకుండా బేకరిలోకి వెళ్లి తిరిగి వచ్చి చూసింది. స్కూటీ కనిపించకపోవడంతో ఆశ్చర్యమై, ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బాడంగి: మండల కేంద్రానికి చెందిన తాన్న శంకరరావు అనే వ్యక్తి పురుగుమందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం అతడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబ కలహాల కారణంగానే అతడు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

రాజాం సిటీ: స్థానిక చెవిటి, మూగ పాఠశాలల్లోని 40 మంది విద్యార్థులకు దాతలు సమకూర్చిన దుస్తులను ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులను అన్ని విధాలా ఆదుకునేందుకు దాతలు ముందుకు వస్తుండడం చాలా ఆనందంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ ఎస్.నాగభూషణరావు తెలిపారు.